వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయం

కోదాడ : కోదాడ చరిత్రలో మునుపెన్నడూలేని విధంగా శనివారం రెండు గంటల పాటు భారీ వర్షం కురిసింది. సాయంత్రం 5 గంటలకు మొదలైన వర్షం ఒక్క నిమిషం కూడా వదలకుండా 7 గంటల వరకు కురిసింది. విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో పట్టణంలో చిమ్మచీకట్లు కమ్ముకున్నాయి. కోదాడ మున్సిపల్ కార్యాలయంలోకి వర్షపునీరు చేరడంతో ముఖ్యమైన ఫైళ్లు నీటిలో తేలియాడుతూ కనిపించాయి. పట్టణంలోని భవానీనగర్, శ్రీరంగాపురం గ్రామాలను వర్షపునీరు ముంచివేసింది. రంగా థియేటర్ సెంటర్ వద్ద రహదారిపై మూడు అడుగుల మేర వర్షపునీరు పారుతోంది. సబ్ స్టేషన్‌లోకి పెద్దచెరువు నీరు చేరడంతో కోదాడలో ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని విద్యుత్ అధికారులు తెలిపారు.

హుజూర్‌నగర్‌లో 27.38 సెంటీ మీటర్ల వర్షం

హుజూర్‌నగర్ : పట్టణంలో శుక్రవారం రాత్రి నుంచి శనివారం రాత్రి వరకు ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. వర్షానికి పట్టణంలోని లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. పలువురి ఇళ్లలోకి వర్షపు నీటితో పాటు మురుగు నీరు చేరింది. రోడ్లపై నీరు పారడంతో పట్టణంలో రాకపోకలకు వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. దీంతో మున్సిపల్ అధికారులు జేసీబీలతో మురుగు నీరు పారే ఏర్పాట్లు చేశారు. కాగా, శనివారం రాత్రి 9 గంటల వరకు 27.38 సెం.మీ వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు.

అలుగు పోసిన చెరువులు

నేరేడుచర్ల : మండలంలో గత రెండు రోజులుగా ఎడతెరపి లేకుండా వర్షం కురిసింది. దీంతో చెరువులు, అలుగు పోస్తున్నాయి. వాగులు, వంకలు పొంగాయి. నేరేడుచర్ల మున్సిపాలిటీలోని పలు లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలోకి నీరు చేరడంతో మున్సిపల్ అధికారులు స్పందించి నీటిని తొలగించారు. మండలంలో పలు చోట్ల పంట పొలాలు పూర్తిగా నీట మునిగాయి. భారీ వర్షాలు కురుస్తున్నందున ప్రజలు అవసరమైతేనే బయటకు రావాలని తహసీల్దార్ సైదులు, ఎంపీడీఓ సోమ సుందర్‌రెడ్డి కోరారు. అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆదేశించారు.


నేరేడుచర్లలో నీట మునిగిన పంట పొలాలు


హుజూర్‌నగర్‌లో రోడ్డుపై వర్షపు నీటిలో ఆగిపోయిన వాహనం

వీధులన్నీ జలమయం

చిలుకూరు : మండల వ్యాప్తంగా శనివారం ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. దీంతో పలు గ్రామాల్లో డ్రెయినేజీ వ్యవస్థ సక్రమంగా లేక వీధులు జలమయం అయ్యాయి. సాగర్ నీటికి వర్షం తోడవడంతో బేతవోలు, చిలుకూరు, నారాయణపురం చెరువులు నీటితో కళకళలాడుతున్నాయి.

నీట మునిగిన వరి పొలాలు

నడిగూడెం : మండల వ్యాప్తంగా శనివారం ఈదురు గాలులతో భారీ వర్షం కురిసింది. నడిగూడెంలోని వాగుతో పాటు చాకిరాల, రత్నవరం గ్రామాల వెంట ప్రవహించే వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. వాగు నీటితో రత్నవరంలో పొలాలు నీట మునిగాయి.

ఇళ్లలో చేరిన వర్షపు నీరు

అనంతగిరి : మండల వ్యాప్తంగా గత మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో శనివారం మండల కేంద్రంలోని ఎన్‌టీఆర్ చౌరస్తాలో రోడ్లపై వర్షపునీరు కాలువను తలపించింది. పాలారం ఎస్సీకాలనీ, శాంతినగర్, తెల్లబండ తండా గ్రామాల్లో ఇళ్లలోకి వర్షపు నీరు చేరింది. దీంతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. తెల్లబండతండాలో గుగులోతు శివ, గుగులోతు గణేష్‌ల ఇళ్లు పూర్తిగా నెలమట్టం అయ్యాయి. ఇళ్లలోని వస్తువులు, వంట సామగ్రి పూర్తిగా తడిసిపోవడంతో దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. వాయిలసింగారం చెరువు నీటిమట్టం పూర్తిస్థాయికి చేరి సుమారు నాలుగు అడుగుల ఎత్తులో అలుగు పోస్తుండడంతో తహసీల్దార్ హిమబిందు, ఎస్ఐ నవీన్ కుమార్ తమ సిబ్బందితో పరిశీలించారు. చెరువు తూము గేటు ఎత్తడంతో పాటు అలుగుపై ఉన్న చెత్తను తొలగించి నీటిని దిగువకు వదిలారు. దీంతో చెరువుకు పెను ప్రమాదం తప్పిందని మత్స్యకారులు తెలిపారు. చనుపల్లి, వెంకట్రాంపురం గ్రామాలకు పూర్తిగా విద్యుత్ అంతరాయం ఏర్పడినట్లు ఏఈ కీర్తిరెడ్డి తెలిపారు. వర్షాల దృష్ట్యా మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్, ఎస్ఐ, ఎంపీడీఓ షేక్ సుష్మలు సూచించారు. మట్టి, శిథిలావస్థకు చేరిన ఇళ్లలో ఉండవద్దన్నారు.

ఉప్పొంగిన వాగులు

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : వర్షానికి చింతలపాలెం మండలంలో వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. శుక్రవారం రాత్రి నుంచి శనివారం ఉదయం వరకు కురిసిన వర్షానికి వజినేపల్లి, దొండపాడు, గుడిమల్కాపురం, చింతలపాలెం తదితర గ్రామల లో వాగులు పొంగుతున్నాయి. దీంతో ఆయా గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. దొండపాడులోని ఎర్రవాగు ఉధృతంగా ప్రవహించడంతో పాఠశాలకు వెళ్లి వచ్చే విద్యార్థులను ట్రాక్టర్‌పై వాగు దాటించారు. దొండపాడు పీఏసీఎస్‌లోకి నీరు చేరి ఎరువుల బస్తాలు స్వల్పంగా తడిసాయి. పలు గ్రామాల్లో రోడ్లు, లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. రెవెన్యూ, పోలీస్ అధికారులు ప్రజలను అప్రమత్తం చేసి రాకపోకలను నియంత్రించారు.

నిండుకుండలా రావిపహాడ్ పెద్దచెరువు

మోతె : గత రెండు రోజుల నుంచి ఎడతెరపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు మండల పరిధిలోని రావిపహాడ్ పెద్ద చెర్వులోకి ఎగువ నుంచి వరద నీరు వస్తుండడంతో నిండుకుండను తలపిస్తోంది. ఇక వర్షానికి మండలంలోని పలు గ్రామాల్లో కుంటలు, చెరువులలోకి భారీగా వర్షపు నీరు వచ్చి చేరుతోంది. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మండలంలో 41.2 మిమి వర్షం నమోదైంది.


చిలుకూరులో వీధుల్లో ప్రవహిస్తున్న వర్షపు నీరు


నేరేడుచర్ల : ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిలిచిన వర్షపు నీటిని తొలగిస్తున్న సిబ్బంది

గరిడేపల్లి మండలంలో..

గరిడేపల్లి : మండలంలోని అన్ని గ్రామాల్లో శుక్రవారం రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. దీంతో వాగులు, వంకలు పొంగాయి. మరో రెండు రోజుల వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ బండ కవిత, ఎస్ఐ నరేష్‌లు సూచించారు.


నడిగూడెం : రత్నవరం వద్ద నీట మునిగిన వరి పొలం


హుజూర్‌నగర్ : 7వ వార్డులో ప్రజలను సురక్షిత ప్రాంతానికి తరలిస్తున్న మున్సిపల్ అధికారులు


కోదాడ మున్సిపల్ కార్యాలయంలో వర్షపునీటిలో ఫాగింగ్ మిషన్


హుజూర్‌నగర్‌లో ఇంట్లోకి చేరిన వర్షపు నీరు


అనంతగిరి : శాంతినగర్‌లో ఓ ఇంట్లోకి చేరిన వర్షపు నీరు


అనంతగిరి : వాయిలసింగారంలో తూము ద్వారా చెరువు నీటిని వదులుతున్న అధికారులు


హుజూర్‌నగర్ : దొండపాడు పీఏసీఎస్ కార్యాలయంలోకి చేరిన వర్షపు నీరు

క్లుప్తంగా

ఐఐఎం కోజీకోడ్‌లో సీటు సాధించిన కోదాడ యువతి


శేకు సుప్రజ

కోదాడ : కోదాడకు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ శేకు సుప్రజ గత జూలైలో నిర్వహించిన ఈమ్యాట్ ఎంట్రెన్స్‌లో ప్రతిభ కనబరిచి కోజీకోడ్‌లోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్‌లో ఎంబీఏ సీటు సాధించింది. హైదరాబాద్‌లోని నారాయణమ్మ కళాశాలలో ఇంజనీరింగ్ పూర్తి చేసిన సుప్రజ హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తూ ఈ పరీక్షకు హాజరైంది. కాగా, సుప్రజ తండ్రి శేకు రమేష్ కోదాడలోని ఈవీరెడ్డి కళాశాలలో గతంలో గణిత అధ్యాపకుడిగా పనిచేశారు. తల్లి నాగరాధిక గృహిణి. ఈ సందర్భంగా సుప్రజను శేకు వెంకటేశ్వర్లు, ఎస్ఎస్‌రావు తదితరులు అభినందించారు.

రిటైర్డ్ కండక్టర్‌కు సన్మానం


జానమ్మను సన్మానిస్తున్న తాడువాయి గ్రామపెద్దలు

మునగాల : మండలంలోని తాడువాయి గ్రామానికి చెందిన మాతంగి జానమ్మ ఆర్టీసీ కోదాడ డిపోలో గత 26 ఏళ్లుగా కండక్టర్‌గా విధులు నిర్వర్తించి శనివారం రిటైర్డయ్యారు. మునగాలలో తాడువాయి గ్రామపెద్దలు ఆమెను పూలమాల, శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సభ్యుడు కోల ఉపేందర్‌రావు, తాడువాయి పీఏసీఎస్ చైర్మన్ తొగరు సీతారాములు, గ్రామ పెద్దలు నాగార్జునపు గోవర్ధన్‌చారి, కోల ఆంజనేయులు, మాతంగి వెంకన్న, కోట అలీబాబు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

హుజూర్‌నగర్ : పట్టణంలోని 14వ వార్డులో అనారోగ్యంతో బాధపడుతున్న బి.వెంకయ్యకు ఆ వార్డు కాంగ్రెస్ పార్టీ బూత్ కమిటీ వారు శనివారం రూ.7 వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ వార్డు అధ్యక్షుడు కె.యోహాన్, డి.సైదులు, ఎం.అశోక్, కె.కాంతయ్య, అబ్రహం తదితరులు పాల్గొన్నారు.

నేడు చిలుకూరులో ముత్యాలమ్మ పండుగ

చిలుకూరు : శ్రావణమాసం చివరి ఆదివారం రోజున చిలుకూరు మండల కేంద్రంలో ముత్యాలమ్మ పండుగ నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. గ్రామస్తులు అమ్మవారికి పెద్దఎత్తున బోనాలు చెల్లించి మొక్కులు తీర్చుకోవాలని కోరారు.

రైతులందరికీ రుణమాఫీ చేయాలని వినతి


ఏఓకు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

గరిడేపల్లి : కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీ ప్రకారం అర్హులైన రైతులందరికీ రూ.2 లక్షల వరకు రుణాలను మాఫీ చేయాలని రైతు సంఘం నాయకులు పోకల వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని కోరారు. ఈమేరకు శనివారం మండలంలోని గానుగబండలోని రైతు వేదికలో మండల వ్యవసాయ అధికారి ప్రీయతమ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రైతులు సీతారాంరెడ్డి, మద్దా భాస్కర్, కందుల రాంరెడ్డి, కడియాల అప్పయ్య, పోకల ఆంజనేయులు, పోకల సాంబయ్య, పోకల సత్యనారాయణ, జొన్నలగడ్డ వెంకన్న, షేక్ నాగులమీర, ఆర్తి వెంకన్న, వీరయ్య, సైదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మంత్రి ఉత్తమ్ ప్రజాదర్బార్ నిర్వహించాలి


మాట్లాడుతున్న ధనుంజయనాయుడు

నేరేడుచర్ల : హుజూర్‌నగర్ నియోజకవర్గ కేంద్రంలో రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి, హుజూర్‌నగర్ ఎమ్మెల్యే నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వారానికి ఒక్కసారి ప్రజాదర్బార్ నిర్వహించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ధనుంజయనాయుడు కోరారు. శనివారం నేరేడుచర్లలోని సీపీఐ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎదైన సమస్యను విన్నవించుకోవడానికి సామాన్య ప్రజలు మంత్రిని కలవడం ఇబ్బందిగా ఉందని, ఎప్పుడు మంత్రి చుట్టూ వందల కొద్ది కాంగ్రెస్ కార్యకర్తలు ఉంటే మంత్రిని సామాన్య ప్రజలు ఎలా కలుస్తారని అన్నారు. సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి యల్లబోయిన సింహాద్రి, పాలకీడు మండల కార్యదర్శి ముక్కాల జానయ్య, పార్టీ పట్టణ కార్యదర్శి కత్తి శ్రీనివాస్‌రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రావుల సత్యం ఉన్నారు.

వర్షాల దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి


మాట్లాడుతున్న ఎస్ఐ ముత్తయ్య

హుజూర్‌నగర్‌రూరల్ : వర్షాలు కురుస్తున్నందున మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ ముత్తయ్య సూచించారు. శనివారం హుజూర్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో ఆయన మాట్లాడారు. వర్షాలకు చెరువులు నిండడంతో వాగులు ఉధృతంగా ప్రవహించే అవకాశం ఉందని తెలిపారు. లోతట్టు ప్రాంత ప్రజలు, పురాతన, శిథిలమైన ఇళ్లలో ఉంటున్న వారు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని చెప్పారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాల ద్వారా ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ప్రజలు జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. ఏదైనా ప్రమాదం జరిగే అవకాశం ఉంటే కంట్రోల్ రూమ్ నంబర్ 6281492368కు ఫోన్ చేసి సమాచారం అందించాలని తెలిపారు.

జాగ్రత్తలు పాటించాలి

నడిగూడెం : మండల వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నడిగూడెం ఎస్ఐ సీహెచ్.అజయ్‌కుమార్, త్రిపురవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి లక్ష్మీప్రసన్న శనివారం ఒక ప్రకటనలో కోరారు. లోతట్టు ప్రాంతాల ప్రజలతో పాటు చాకిరాల, రత్నవరం గ్రామాల సమీపాన ఉన్న కల్వర్టుల వద్ద రాకపోకల సమయంలో జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. వర్షాలకు సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని కావున ప్రతిఒక్కరూ తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు.

కాంట్రాక్టర్ నిర్లక్ష్యం.. నీట మునిగిన పొలం


బాదావత్‌తండా వద్ద నీట మునిగిన వరి పొలం

మఠంపల్లి : మండలంలోని వరదాపురం నుంచి కామంచికుంటతండా వరకు ఇటీవల ఫార్మేషన్ రోడ్డు నిర్మించారు. కానీ వర్షాలకు వచ్చే వరద నీరు వెళ్లేందుకు రోడ్డు మధ్యలో గూనలు ఏర్పాటు చేయలేదు. దీంతో రోడ్డు పక్కన బాదావత్ తండాకు చెందిన బానోతు బుజ్జీ, మగతానాయక్, దేవ్‌జీ, వాచ్యానాయక్‌ల 5 ఎకరాల వరి పొలం శనివారం కురిసిన వర్షానికి పూర్తిగా నీట మునిగింది. నీట మునిగిన పొలాన్ని మండల పీఏసీఎస్ వైస్ చైర్మన్ బానోతు బాబునాయక్ పరిశీలించి మాట్లాడారు. రోడ్డు వేసిన కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో పొలం నీట మునిగిందని, సదరు రోడ్డు కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకుని రైతులకు నష్టపరిహారం ఇప్పించాలని ఆయన డిమాండ్ చేశారు.

ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలి

- ఆర్డీఓ శ్రీనివాసులు

నేరేడుచర్ల : మున్సిపాలిటీతో పాటు మండలంలో ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని హుజూర్‌నగర్ ఆర్డీఓ శ్రీనివాసులు అన్నారు. శనివారం నేరేడుచర్లలోని తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయంలో ఆయా శాఖల అధికారులతో ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిశీలన, స్థానిక సంస్థల ఎన్నికలకు ఓటరు జాబితాపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓటరు జాబితా ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాలను త్వరితగతిన గుర్తించాలన్నారు. ఈనెల 15వ తేదీన ఓటరు జాబితా అన్ని పోలింగ్ కేంద్రాల్లో అందుబాటులో ఉంచాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగుపై ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో ఓటరు జాబితా ప్రక్రియను ఆయన పరిశీలించారు. సమావేశంలో ఎంపీడీఓ సోమ సుందర్‌రెడ్డి, తహసీల్దార్ శంకరయ్య, మున్సిపల్ కమిషనర్ అశోక్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ మౌనిక, సర్వేయర్ గాయత్రి, కోటి, సిబ్బంది ఉన్నారు.


నేరేడుచర్ల ఎంపీడీఓ కార్యాలయంలో ఓటరు జాబితా ప్రక్రియను పరిశీలిస్తున్న ఆర్డీఓ

అంకితభావంతో పనిచేస్తే గుర్తింపు

కోదాడ : అంకితభావంతో పనిచేసే ఉద్యోగులకు సమాజంలో గుర్తింపు ఉంటుందని కోదాడ ఎంఈఓ సలీం షరీఫ్ అన్నారు. కోదాడ బాలుర పాఠశాలలో పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందిన కే.పూర్ణచందర్‌రావుకు శనివారం నిర్వహించిన వీడ్కోలు సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం పూర్ణచందర్‌రావును తోటి ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కృష్ణయ్య, వీరారెడ్డి, వెంకటేశ్వరరావు, రామిరెడ్డి, నరసింహారావు, శ్రీనివాసరెడ్డి, రాజారాం, ఇర్ల శ్రీనివాసరెడ్డి, బడుగుల సైదులు తదితరులు పాల్గొన్నారు.


ఉద్యోగ విరమణ పొందిన పూర్ణచందర్‌రావును సన్మానిస్తున్న తోటి ఉపాధ్యాయులు

కేఆర్‌ఆర్ డిగ్రీ కళాశాలలో..

కోదాడ పట్టణ పరిధిలోని బాలాజీ నగర్‌లో గల కేఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏఓగా పనిచేస్తున్న యుగంధర చక్రవర్తి శనివారం ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా కళాశాలలో ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశంలో కళాశాల ప్రిన్సిపాల్ చందా అప్పారావు మాట్లాడారు. ఏఓగా చక్రవర్తి కళాశాల అభివృద్ధికి చేసిన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా ఆయనను తోటి అధ్యాపకులు సన్మానించారు. కార్యక్రమంలో నాగిరెడ్డి, సైదులు, రఫీ, వెంకటేశ్వరరెడ్డి, సైదులు, శ్రీదేవి, యాదమ్మ, ఫ్రాన్సిస్ తదితరులు పాల్గొన్నారు.

హెడ్ కానిస్టేబుల్ కుటుంబానికి చేయూత

సూర్యాపేటటౌన్ : రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ జలగం రాములు కుటుంబానికి జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయ ఏఆర్ పోలీస్ సిబ్బంది అండగా నిలిచారు. శనివారం ఆయన దశదిన కర్మ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులకు రూ.లక్షా 40వేలు అందజేశారు.


రాములు కుటుంబ సభ్యులకు నగదు అందజేస్తున్న ఏఆర్ కానిస్టేబుళ్లు

స్టడీ సెంటర్‌ను ఏర్పాటు చేయాలి

మిర్యాలగూడ టౌన్ : ప్రతి మండల కేంద్రంలో ఎరుకుల సంక్షేమంతో పాటు విద్యార్థులు చదువుకునేందుకు స్టడీ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని ఆలిండియా ఎరుకుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర నేత వజ్జగిరి అంజయ్య అన్నారు. శనివారం పట్టణంలో జెండా పండుగ సందర్భంగా సంఘం కుర్ర జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. ప్రతి ఒక్కరు సంఘం బలోపేతంకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో వజ్జగిరి వెంకన్న, మహేష్, వెంకటేశ్వర్లు, శ్రీను, నాగయ్య, మారయ్య తదితరులున్నారు.

పోస్టల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ కమిటీ ఎన్నిక

సూర్యాపేట : పోస్టల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ డివిజన్ కమిటీని శనివారం ఎన్నుకున్నారు. భారతీయ పోస్టల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ గ్రూప్ సీ ఉద్యోగుల మీటింగ్‌లో ఈ ఎన్నిక నిర్వహించారు. సూర్యాపేట డివిజన్ సెక్రెటరీగా జంజిరాల సైదులు, ప్రెసిడెంట్‌గా కె.దయాకర్, ట్రెజరర్‌గా బి.సునీల్ కుమార్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఉద్యోగుల సమస్యలపై పోరాటం చేస్తామని తెలిపారు.

మట్టపల్లిలో నిత్యారాధనలు


కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు


మఠంపల్లి: మట్టపల్లి క్షేత్రంలో శనివారం శ్రీరాజ్యలక్ష్మీ చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి వారికి నిత్యారాధనలు కొనసాగాయి. అనంతరం శ్రీస్వామి అమ్మవార్లను వధూవరులుగా అలంకరించి ఎదుర్కోలు మహోత్సవం చేపట్టారు. ఆ తర్వాత అర్చకులు నిత్యకల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, హుజూర్‌నగర్ మున్సిపల్ మాజీ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్‌గౌడ్, కడియాల రామకృష్ణ, ఈఓ నవీన్‌కుమార్, అర్చకులు తూమాటి శ్రీనివాసాచార్యులు, పద్మనాభాచార్యులు, బదరీనారాయణాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఆంజనేయాచార్యులు, వంశీకృష్ణమాచార్యులు పాల్గొన్నారు.


విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి


సామూహిక జన్మదిన వేడుకలో పాల్గొన్న రిటైర్డు ఉద్యోగులు

హుజూర్‌నగర్ : విశ్రాంత ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించాలని విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు ఎమ్ఎస్ఎన్ రాజు, చెన్నా సోమయ్య కోరారు. శనివారం హుజూర్‌నగర్ పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల సంఘం భవనంలో రిటైర్ ఉద్యోగులు ఎస్.వెంకటమ్మ, లలితమ్మ, పి.జోజీ, పిచ్చయ్య, పి.చంద్రశేఖర్‌ల సామూహిక పుట్టినరోజు వేడుకలను విశ్రాంత ఉద్యోగులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్ని ప్రభుత్వాలు మారిన విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కారం కావడం లేదని వారు అన్నారు. ఎన్నో ఏళ్లు వివిధ ప్రభుత్వ శాఖలలో విధులు నిర్వహించి రిటైర్డ్ అయిన ఉద్యోగులకు ప్రభుత్వాలు అందించే బెనిఫిట్స్ అందటం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు ఎ.రమేష్, ఎ.అప్పయ్య, వి.నర్సయ్య, డి.వెంకటేశ్వర్లు, ఆర్.కోటయ్య, ఎం.మధు, జె.వెంకటేశ్వర్లు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న రుణమాఫీ ఇంటింటి సర్వే


మునగాల : బరాఖత్‌గూడెంలో రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న సిబ్బంది


మఠంపల్లి : చౌటపల్లిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న వ్యవసాయ అధికారులు

మునగాల : రేషన్‌కార్డు లేక రూ.రెండు లక్షల రుణమాఫీ కాని రైతుల నుంచి దరఖాస్తుల స్వీకరణ కోసం వ్యవసాయ శాఖ చేపట్టిన ఇంటింటి సర్వే కొనసాగుతోంది. శనివారం మండలంలోని ముకుందాపురం, బరాఖత్‌గూడెం, కృష్ణానగర్ గ్రామాల్లో సర్వే చేపట్టారు. ఆయాగ్రామాల్లో 69 మంది రైతుల వుంచి దరఖాస్తులు స్వీకరించినట్లు మండల ఏఓ బుంగా రాజు తెలిపారు. సోమవారం గణపవరం, తిమ్మారెడ్డిగూడెం, కొక్కిరేణి గ్రామాల్లో సర్వే చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ మండల విస్తరణాధికారులు మేడిశెట్టి ఉషశ్రీ, మాచర్ల రమ్యతేజ, చిక్కుల భవాని, బాణావత్ నాగు పాల్గొన్నారు.

చౌటపల్లిలో రుణమాఫీ సర్వే

మఠంపల్లి : మండలంలోని చౌటపల్లిలో రుణమాఫీ కాని రైతుల కోసం శనివారం వ్యవసాయ శాఖ అధికారులు ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ రూ.2 లక్షల రుణమాఫీ వర్తించని రైతుల నుంచి కుటుంబ సభ్యుల ఆధార్ ధృవీకరణతో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట ఏఈఓలు పిల్లుట్ల భవన్, శ్రావంజలి, రైతులు ఉన్నారు.